# 8

## అన్నలు

"రామారావు మంచివాడేనా?"

"ఎందుకూ?"

"చెప్పవోయ్! రామారా వెలాంటివాడు?"

"రామారా వెలాంటివాడైతే నీ కెందుకోయ్!"

"సీరియస్‌గా అడుగుతున్నాను. ఎలాంటివాడతను?"

"నువ్వెలాంటివాడివని అతను నన్నెప్పుడూ అడగలేదు."

"అతనితో మనకి పని పడిందిలే?"

"ఏం పని?"

"చెప్తాగా? అసలత నెలాంటి వాడో చెప్పు ముందు."

"ఎలాంటివాడు కావాలి నీకు?"

"మంచి వాడు."

"అంటే?"

"అంటే ఏమిటి? అతను సిగరెట్లు, అవీ తాగుతాడా?"

"సిగరెట్లు, అవీ తాగేవాళ్ళు చెడ్డవాళ్ళా?"

"అబ్బ! అదికాదోయ్! అల్లాంటి అలవాట్లన్నీ మంచి లక్షణాలా?

ఆరోగ్యాలు చెడతాయి. సంసారాలు అప్పులపాలౌతాయి. అవన్నీ ఆలోచించనివాడు మూర్ఖుడేకదా!"

"దానికి నా ఆర్గ్యుమెంటు చాలా వుంది గానీ రామారావు సిగరెట్లు కాల్చాడు. బీడీలూ చుట్టలూ కాలుస్తాడను కుంటాను. చవకనీ—ఆరోగ్యానికి కొంతన్నా మంచిదనీ...."

"ఏడిసినట్టుంది. ఈ రోజుల్లో చుట్టలేమిటి? బీడీలుకూడానా? సిగ్గు చేటు. ఆ కాల్చేదేదో సిగరెట్లే అయితే నలుగుర్లో ఫేషనుగానన్నా వుంటుంది."

"నీకు కావలసింది అదన్నమాట.... ఫేషనూ గొప్పా.... ఇప్పుడేగా అనారోగ్యం, డబ్బు ఖర్చు అన్నావు ..."?

"నువ్విలా మాట మాటకి పెడర్థాలు తీస్తా వెందుకోయ్? మనం కాస్త పది మంది మధ్యా తిరగాలి కదా?"

"రామారావు పది మంది మధ్య తిరగటం లేదనా ఏమిటీ నీ వుద్దేశ్యం?"

"నీకో నమస్కారం నాయనా! అసలు సంగతి చెప్తావా, పొమ్మంటావా? రామారావు మీ ఆఫీసులోవాడేకదా, అతని సంగతి నీకు బాగా తెలిసి వుంటుందని నేనెంతో ఆశపడివా స్తే ..."

"అంత నిరాశపడకుమరి. పోనీ ఇప్పుడడుగు. ఏంచెప్పమంటావు?"

"అదే రామారావు సంగతి. మంచివాడేనా?"

"నీకీ పిచ్చి పట్టిందేవిటి? రామారావు మంచి గోల నీ కెందుకోయ్ బాబూ!"

"అదిగో, ఇప్పుడేగా చెబుతానన్నావు?"

"అన్నానని నాకూ నీకూ అవసరంలేని చెత్తంతా వాగుతానా?"

"అవసరం వొచ్చింది గనకే కదా?"

"ఆ అవసరం నాకు చెప్పకూడదు. నేను మాత్రం నాకు తెలిసిన రహస్యాలన్నీ నీ కందించాలి. ఏం మనిషివో!"

"అది కాదోయ్! నీకు చెప్పటానికేం?.... మా రాధని రామారావు కిద్దామనీ."

"రాధనా? ఇచ్చెయ్యటమే!"

"అలా అనటం మన సంప్రదాయం. తరతరాలనించీ...."

"సరేసరే! ఇప్పుడా తరాలన్నీ చీల్చుకుంటూ వెళ్ళకు. ఈ జన్మకి వెనక్కి రాలేవు. అయితే రాధకి పెళ్ళి వ్యవహారం అన్నమాట. ఇంకా చదువుతోన్నట్టుందిగా?"

"చదువుతోందిలే పెళ్ళయితే మానేస్తుంది."

"తనే మానేస్తానందా?"

"తను చదువుతాననే అంటోంది. మా అమ్మా.... మా నాన్న గారూ "

"మీ మేనత్తా.... మీ బామ్మర్దీ...."

"చాల్లేవోయ్! నీకు మరీ నవ్వులాటగా వుంది, పెళ్ళి కెదిగిన ఆడ పిల్ల గురించి పెద్దవాళ్ళు ఆలోచించరా?"

"ఎందుకూ? ఆడపిల్లకి ఆలోచించటం చేతకాదనా? ఆడపిల్లలు ఎదిగిఎదిగి పెద్దవాళ్ళవటం పెళ్ళికే నన్నమాట. ఎప్పటికైనా సమాజంలో పెళ్ళి అనేది లేకండాపోతే ఆడపిల్లలు ఎదగడం మానేస్తా రను కుంటాను."

"నీతో ఎవడు మాట్లాడగలడు? ఇంతకీ రామారావు సంగతి చెప్పవా?"

"చెప్తాలే ముందు రాధ సంగతి కానీ, ఆమె చదువుతా నంటోంటే ఎవడు మంచివాడో వెతుక్కుని వాడి కిచ్చేసే వ్యవహారం ఎందుకు?"

"ఏమిటోయ్ బొత్తిగా ఈ లోకం మనిషి కానట్టు మాట్లాడుతావు? ఆడపిల్లకి ఇప్పట్నుంచి సంబంధాలు చూడకపోతే పాతికేళ్లొచ్చినా పెళ్ళి చెయ్యలేం."

"నువ్వు చాలా మాటలు కత్తిరించుకోవాలి శేషగిరీ, వొకరి పెళ్ళి ఇంకోరు చెయ్యటం అనే ప్రసక్తిలేదు. ఎవరిపెళ్ళి వారే చేసుకోగలరు. కనీసం....వాళ్ళు కోరినప్పుడు... కావాలన్నప్పుడు...."

"కావాలని ఆడపిల్లలు చెపుతారటోయ్?"

"ఓహో! ఆడపిల్లల తండ్రీ! ఏభై ఏళ్ళవాడివా నువ్వు? ఎంత మంది కూతుళ్ళని కని పెంచావు? ఏ ఆడపిల్ల మనసూ నీకు అర్థంకాలేదా?"

"వెటకారం చేస్తే చెయ్యిగానీ మా కుటుంబ పరిస్థితి నీకు తెలీదోయ్! మా నాన్నగారికి బీ పీ వచ్చిన దగ్గిర్నుంచీ అమ్మకి వొకటే బెంగగా వుంది. రాధకి పెళ్ళి కాకుండానే ఆయన పోతారేమోనని...."

"పెళ్ళయింతర్వాత పోతే ఫర్వాలేదా? అసలు పోయితీరాలా?"

"రాధకు పెళ్ళవకుండానే నాన్నగారు పోతే ఎలాగ?"

"ఏంపోతే? తర్వాత రాధకి పెళ్ళే కాదా?"

"అవుతుందనుకో, ఆ ముచ్చట ఆయనకూడా చూడాలికదా?"

"ఆ లెక్కన ఇంకా చాలా చూడాలి. వెయ్యేళ్ళు బతికినా మనం చూడాల్సిన ముచ్చట్లు మిగులుతూనే వుంటాయి. నెహ్రూ లాంటి జిజ్ఞాసాపరుడు - చంద్రుడి మీద మనిషి దిగిన మహాద్భుతం చూడకుండానే పోయాడు?"

"నాయనా? నీకో నమస్కారం! పోతాను?"

"రామారావు సంగతి అక్కర్లేదా?"

"అక్కర్లేదులే?"

"సరే వెళ్ళు సినిమా అన్నలాగ చెల్లెలికి సంబంధాలు వెదికి వెదికి తల తాకట్టుపెట్టి చెల్లెలికి పెళ్ళిచేసి- పందిట్లో నిలబడి గర్వపడుతూ ఫోటో తీయించుకునే ఛాన్సుపోతుంది నీకు?"

"నేను అందుకే చేస్తున్నాననుకుంటున్నావా? తండ్రీ అనారోగ్యవంతుడై పోతే ఆడపిల్ల పెళ్ళి చెయ్యటం తోడబుట్టినవాడి బాధ్యతకదా?"

"అవునవును. కొందరెప్పుడూ అల్పులుగానూ అసమర్థులుగానూ- బలహీనులుగానూ తలుస్తూ వుంటేతప్ప మనం గొప్పవాళ్ళం కాలేము. ఆడపిల్లల జీవిత నిర్ణయాలమీద బాధ్యత మన చేతుల్లోనే వుంది."

"తిడితే తిట్టుగానీ.... అసలు సంగతి చెప్పవోయ్‌బాబూ! రామారావుకి రాధనిస్తే బావుంటుందంటావా!"

"ఎవరికి బావుండటం?"

"ఎవరికేమిటి? మనకే- పోనీ రాధకి...."

"ఆ సంగతి నా కెలా తెలుస్తుంది,"

"నీకో చెల్లెలుంటే నా బాధ తెలిసేదోయ్,"

"నాకో చెల్లెలుంటే నీలాగే రామారావు వెనకాల, గీమారావు వెనకాల సి. ఐ. డీ. లాగ తిరుగుతాననుకున్నావా ?"

"మరి పెళ్ళెలా చేస్తావు?"

"నేను చెయ్యటం ఏమిటి? నాన్సెన్స్!"

"నువ్వలా తప్పుకునే రకంవాడివే సందేహం లేదు. పోనీలే. మా చెల్లెలికి నేను పెళ్ళి చెయ్యక తప్పదు. దాని కష్టసుఖాలు చూడవలసిన వాణ్ణి నేనే. అరగంట నించీ అసలు సంగతి రానివ్వలేదుగదా? నీ కిది న్యాయం కాదు ప్రకాశం! నీకు తెలిసిన రెండు మాటలు చెప్తే ఏం పోతుంది? రాధకి మంచి సంబంధం చెయ్యాలని... "

"మంచి సంబంధం అంటే...."

"అబ్బ! ఏమిటోయ్ నీ ప్రశ్నలు?.... మొన్న మా వీధిలో ఓ దుర్మార్గుడు పెళ్ళానికి విషంపెట్టి చంపేశాడు. ఇప్పుడు తెలిసిందా మంచికీ చెడ్డకీ తేడా...."

"నీ పిచ్చి. పెళ్ళానికి విషంపెట్టి చంపటం చాలా మంచి విషయం మనసంతా విరిచి గాయపరిచి జీవచ్ఛవాన్ని చేసి వుంచటంకన్నా. అయినా రామారావు పెళ్ళానికి విషంపెట్టి చంపుతాడో లేదో ఎలా తెలుస్తుంది మనకి? అడుగుదామా?"

"చాల్లేవోయ్ ఇష్టం లేకపోతే చెప్పను పొమ్మన రాదూ? ఇంత హస్కు ఎందుకు?"

"గ్రహించావు కదా? నిజంగానే ఇతర్లని గురించి మంచి చెడ్డలు నేనేమీ నిర్ణయించలేను. అది నాకు సంబంధించిన వ్యవహారంకాదు. నా సంగతి అడుగు చెప్పుతాను, నే నెలాంటి వాణ్ణి? మంచివాణ్ణేనా?"

"మహా మంచివాడివిలే, ఏ పిల్ల వస్తుందో గానీ...."

"అంత మంచివాణ్ణయితే— మీ రాధకోసం వేరే సంబంధాలెందుకు చూస్తావు సిగరెట్లన్నా తాగని వాణ్ణి."

"చాల్లేవోయ్! నీ హాస్యాలూ నువ్వూను. రామారావు సంగతి మాట్లాడసలు."

"అదేం కుదరదు. నా సంగతి మాట్లాడు నువ్వు. నా చదువూ నా ఉద్యోగం ... నా అలవాట్లూ, అన్నీ క్షుణ్ణంగా తెలుసు నీకు. రామారావులాగా నేను నీకు కొత్తవాణ్ణి కాదు. రాధకి ఇంత తొందరగా పెళ్ళి ప్రయత్నాలు చేస్తారని నే ననుకోలేదు. లేకపోతే ఎప్పుడో చెప్పేవాణ్ణి.... రాధంటే నాకు చాలా యిష్టమని. నీకు చెప్పటానికి నాకేం సందేహం లేదు. రాధకూడా నన్నిష్టపడుతుందనే నా నమ్మకం. నువ్వడిగి చూడు. లేకపోతే నేను మాట్లాడుతాను! నేనేదో హాస్యాని కంటున్నాననుకుంటున్నావా? ఐదారు నెలలనించీ నేనీ విషయం చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాను.... అదేవిటి అలా చూస్తావు? మాట్లాడవే?"

"ఏం మాట్లాడను మతి పోతోంటే."

"ఎందుకూ? నీ చెల్లెలికి నేను తగినవాణ్ణి కాదని భయంగావుందా!"

"అసలు సంగతి ఎరగనట్టు మాట్లాడతావేమిటి? నువ్వే మా కులం అయితేనా నువ్వు కోరిన కట్నాలూ కానుకలూ ఇచ్చి నీ కాళ్ళుకడిగి కన్యాదానం చేనేవాణ్ణోయ్! తెలుసా?"

"నాకవేమీ వద్దు శేషగిరీ! కులం గోత్రం అని నువ్వింకా చాదస్తంగా ఆలోచిస్తావెందుకు? సంవత్సరాల తరబడీ కష్టసుఖాలు పంచుకుంటూ స్నేహితులుగా జీవిస్తున్నాం. తిన్నా.... తాగినా, ఈ కులం మనకి

ఎన్నడూ అడ్డం రాలేదే! ఇంకా మన మధ్య ఇది ఇంత భయంకరంలా వుందా? వొద్దు. అదంతా పాతకాలం సంగతి. దానికిప్పుడు విలువేముంది?"

"నీకు తెలియదు ప్రకాశం నువ్వు ఇలాంటివన్నీ లెక్కచెయ్యవు గానీ, మాకు సాధ్యం కాదు. అసలు మా అమ్మా, మా నాన్నగారూ వొప్పు కోరు. మా బంధువులంతా హేళన చేస్తారు."

"వాళ్ళందర్నీ లక్ష్యపెట్టకు. చెల్లెలికి పెళ్ళిచేసే బాధ్యతంతా నీదే అన్నావుగా? పెళ్ళి చెయ్యలేని తండ్రికి కూతురిమీద అధికార మేముం టుంది? వాళ్ళందరికి నువ్వు నచ్చచెప్పాలి. లేకపోతే ధిక్కరించాలి. నువ్వు అవునంటే నీ చెల్లెలుకూడా ధైర్యం చేస్తుంది."

అదంతా జరగదులేవోయ్! ఏనాటినుంచో వస్తోందిది. కులాలూ, మతాలూ వొదులుకోవటం నువ్వు మాటలు చెప్పినంత తేలికా? రాధ కన్నా అందమైన పిల్ల దొరుకుతుంది నీకు. పదిమందీ ఎలాపోతే మనంకూడా అలాగే .."

"శేషగిరీ! నీతో వాదించే స్థితిలో లేను నేనిప్పుడు. నువ్వు నా విషయంలో కొంతన్నా సానుభూతితో ఆలోచిస్తావని ఎంత ఆశ పెట్టు కున్నానో తెలుసా? రాధ కావలసిన మనిషికి రాధకన్నా అందమైనవాళ్ళెం దుకు? ఇంత చిన్న విషయం నీకు అర్థం కాకపోతే నేనేం చెయ్యను? సిగరెట్లు కాల్చే అలవాటుంటే మానేవాణ్ణి నీ చెల్లెలికోసం. నువ్వు లక్ష ఆటంకాలు పెడితే పాటించేవాణ్ణి. కానీ.... ఈ కులం ... ఎలా వొదుల్చు కోను, అస లిది ఎక్కడుందో అంతుచిక్కటంలేదు నాకు. శేషగిరీ! నా కోసం నువ్వు కొంచెం సాహసం చెయ్యలేవా? నేను నిన్ను అర్థిస్తున్నాను. జీవితాలకి ఏమీ అవసరం లేని మూర్ఖత్వాలు వదిలెయ్యి. మీ వాళ్ళకి చెప్పి.... ఈ పెళ్ళి జరిగేలా చెయ్యి నాకోసం...."

"నీ మాటలు వింటోంటే నాకు చాలా జాలిగా వుంది ప్రకాశం! నన్నేం చెయ్యమంటావు? మా కుటుంబాల్లో.... ఎక్కడా.... ఇంతవరకూ వర్ణాంతర వివాహాలు జరగలేదు."

"పోనీ ఇప్పుడు జరగనియ్యి."

"దానివల్ల చాలా ఇబ్బంది లున్నాయిలేవోయ్! రేపు పిల్లలు పుడితే ఏ కులం అవుతారు?"

"కులం వదులుకున్నవాళ్ళ పిల్లలకి మళ్ళీ ఏదో కులం ఎందుకు? అసలీ కులాలు ఇప్పటి మనుషులకి అవసరం అని కదా?"

"కానీ వాళ్ళని మిగతా పిల్లలు ఎంత హేళన చేస్తారో తెలుసా? వాళ్ళు మానసికంగా ఎంత నలుగుతారో...."

"అదంతా ఇరుకు మనసుతో వూహించే దరిద్రం. అలాంటి పిల్లలే మానసికంగా చాలా ఉన్నతులౌతారు.

"అదంతా ఎందుకొచ్చిన ఇబ్బంది? జరగదులేవోయ్! మావాళ్ళొప్పు కోరు."

"సరే మీ రెవ్వరూ వొప్పుకోవద్దు. రాధ మిమ్మల్ని ధిక్కరించి నన్నిష్టపడి రిజిష్టర్ మేరేజ్ చేసుకుంటే?"

"ఇంకేం చేసుకో, నన్నడిగేదెందుకు? మా యింటి ఆడపిల్లలు వంశానికి మచ్చ తెస్తారనుకుంటున్నావా?"

"నిజంగా నీ చెల్లెలు వంశానికి మచ్చ తెచ్చేరకం కాకపోతే, నేను నిశ్చింతగా మర్చిపోతాను. సరేనా? ఓసారి నేను రాధతో మాట్లాడాలి. మీ ఇంట్లోగానీ, బయటగానీ.... ఎక్కడన్నాసరే. నాకా ఏర్పాటు చెయ్యి. ఈ సహాయంకూడా చెయ్యకూడదా! ఎప్పుడు రాను?"

"భలేవాడివే! నలుగుర్లో మమ్మల్ని నవ్వులపాలు చేసేలాగు న్నావే!"

"నేను చేసేదేమిటి? మీ మూర్ఖత్వమే చేస్తుంది. రేపు రానా?"

"వొద్దు. ఏం ప్రయోజనం వుండదు."

"నీ కనవసరం ఆ మాట రాధని చెప్పనీ."

* * *

ఆ మాట రాధే చెప్పింది ప్రకాశానికి. వాళ్ళన్న రాధకి చెప్పిన మాటలు—"ప్రకాశం మంచివాడే. మన కులంలో అయితే అలాంటివాణ్ణి పాతికవేలిచ్చినా తేలేము. నిజమే, కాని....ఎలాగ? మనవాళ్ళెవ్వరూ చెయ్యనిపని మనం చేస్తే ఎన్ని ఇబ్బందులో! రేపేం జరిగినా మనకి సంఘం సానుభూతి ఉండదు. ఆలోచించుకో" అన్నాడు.

రాధ ఆలోచించలేదు. ఆలోచించా ననుకుంది. "అన్నయ్య కూడా ఆలోచించాడు కదా?" అనుకుంది.—"రిజిష్టర్ మేరేజా! వర్ణాంతర వివాహమా? నేనలా చెయ్యలేనండీ! మా అమ్మా, మా నాన్న, మా అన్నయ్య—అంటోంటే ఆమె మొహంలో వాళ్ళ ముసలి తాతలు కూడా కనపడ్డారు ప్రకాశానికి. రాధ పుట్టినింటికి అపకీర్తి తీసుకురాని పిల్లేనని తేలిపోయింది.

చాలా తొందరలో రాధని రామారావుకిచ్చి వాళ్ళన్న సంప్రదాయ సిద్ధంగా పెళ్ళిచేసి, కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

ప్రకాశానికి తన తర్కానికీ, జ్ఞానానికీ అందని వేదన మిగిలి పోయింది.

ప్రకాశానికీ, శేషగిరికీ మధ్య సంబంధాలేవీ మారలేదు. వీలయినప్పుడల్లా ఇద్దరూ కలుస్తున్నారు. రాధ పెళ్ళయిన మొదట్లో కొంత కాలం శేషగిరి ఆమె జీవితం గురించి సంతోషంగా కబుర్లు చెప్తూండేవాడు. క్రమంగా అవి విషాదకరంగా మారాయి. శేషగిరి రాధ సంగతులు ఎప్పుడు ఎత్తబోయినా "ఇప్పుడా కబుర్లెందుకూ? ఇంకేమైనా మాట్లాడు," అని ప్రసక్తి తప్పించేవాడు.

రాధకి పెళ్ళయి మూడేళ్ళు దాటింది. ఆమూడేళ్ళలో సగం కాలానికి పైగా రాధ పుట్టింట్లోనే వుంది. మూటయామై సంవత్సరాలు కాపరం చేస్తే సంభవించేటన్ని విషాద సంఘటనలు జరిగాయి అ మూడేళ్ళలో. కొన్ని దాచినా, కొన్ని వర్ణించేవాడు శేషగిరి ప్రకాశం దగ్గిర. ప్రకాశం

ఎంత అనిష్టంగా విన్నా రాధ పరిస్థితి చాలావరకు అతనికి అర్థమయింది.

రాధ అత్తగారికి మొదటినించీ కోడలుతెచ్చిన లాంఛనాలు నచ్చక.... చాలక....అసంతృప్తి. తల్లికి అసంతృప్తి కలిగించే భార్య మీదా, ... అత్తవారిమీదా రాధభర్తకి ద్వేషభావం. రాధ నగలు పాడుచేసిన అల్లుడిమీద రాధ తల్లిదండ్రులకి ఈసడింపు. చెల్లెలి క్షేమాలు కనుక్కోడానికి తరుచూ వెళ్ళే అన్నగారిమీద రాధ భర్తకి భరించలేని అసూయ, అన్నిటినీ మించి రాధకీ, రామారావుకీ మధ్య అంతులేని దూరం—అగాధం.

ఈపరిస్థితంతా వింటోంటే ప్రకాశానికి చాలా అసహ్యం కలిగేది. రాధ ఆత్మహత్య చేసుకుంటాననేంత విరక్తితో మాట్లాడుతోందని శేషగిరి అన్నప్పుడు ప్రకాశం అశాంతి అధిక మయింది"

"శేషగిరీ! అన్ని సంసారాలూ ఇలాగేవున్నాయి. నీచెల్లెలికి కొత్తగా వొచ్చిపడ్డ కష్టం ఏమీలేదు. మనం మనుషులకన్నా ఇతర విషయాలకి ఇచ్చే విలువలు—మనల్ని ఇంత హీనస్థితికి లాగుతున్నాయి. అసలు విషయం గుర్తించకుండా విచారించి ఏం లాభం?" అన్నాడు.

"నీకు తెలీదు ప్రకాశం! వొకరోజో, రెండు రోజులో అయితే భరించ వొచ్చును. దానిబతుకంతా ఇంతేనా? మొన్న ఎందుకో అకారణంగా పోట్లాటపెట్టి....నా ఎదురుగా దాన్ని, ఛెళ్ళున లెంపకాయ లేశాడు, దరిద్రుడు.

"నీ ఎదట లెంపకాయ లేశాడనేగా అంతకోపం? చాటుగా అయితే ఫర్వాలేదా?"

"చాటుగా, ఏం ఏడిస్తే ఎవడిక్కావాలి?"

"నీ ఎదుట నీ చెల్లెల్నికొట్టి నిన్నుకూడా అవమానం చేసినప్పుడు అతని ఆత్మ ఎంత గర్విస్తుందో ఆలోచించు. అతన్ని చాలా తేలిగ్గా క్షమిస్తావు నువ్వు, అవునా? క్షమించినట్టేగా? అతన్నేం చెయ్యగలిగావు?"

"క్షమించటమా? పాడా? భార్యాభర్తల గొడవల్లో మనమేం చెయ్య

గలం? భార్యా భర్తల గొడవలే గాని అన్నా చెల్లెళ్ళ సంబంధాలనేవి ఏమీ లేవా?"

"ఉండి ఏం లాభం? వాళ్ళ వ్యవహారం ఇంకా చెడిపోతుంది."

"చెడువేపు మొగ్గేదాన్ని చెడనివ్వటం చాలా మంచిది. వాళ్ళిద్దరి మధ్యా నువ్వు కల్పించుకో అక్కర్లేదు. ఆమెకి ఇష్టంలేని పరిస్థితుల నించి సాధ్యమైనంత సుఖమైన స్థితికి వొచ్చేలాగ... నీ ప్రోత్సాహం ఇవ్వవచ్చు కదా?"

"అంతా అయిపోయిం తర్వాత ఏం ప్రోత్సాహం! ఏం సలహాలు! మూర్ఖుడు! దాని జీవితం ధ్వంసం చేశాడు."

"నువ్విలాగ చీటికీ మాటికీ అతన్ని తిడుతూంటే వినటానికి నాకు చిరాగ్గా వుంది. అసలు ఆమె జీవితాన్ని ధ్వంసం చేసింది నువ్వే. అతను కాదు. అతనికి ధ్వంసం అనే భావం లేదు. ఉంటే భార్యతో ముడిపడి వున్న తన సొంత జీవితాన్ని అతను ధ్వంసం చేసుకోడు."

"నేనేం చేశానోయ్! నీ విషయంలో నేను సాహసం చెయ్యలేక పోయాను. అయితే మాత్రం రాధ కేం లోటు చేశాను? బోలెడు కట్నం ఇచ్చాను. లాంఛనాలన్నీ జరిపాను. ఏం లాభం? వాళ్ళుత్త దురాశ మనుషులు నిజంగా....రాధని నీకే పెళ్ళిచేస్తే చాలా సుఖపడేది. దాన్నిగురించి నాకీ దిగులుండేది కాదు."

"నువ్వేదో తప్పు చేశావనీ, పశ్చాత్తాపపడమనీ-నేననటం లేదోయ్! నన్ను చేసుకోనందుకే రాధ కష్టాలు పడుతోందని నా అభిప్రాయం కాదు. వ్యక్తుల్ని నిర్ణయించుకోవటంకన్న వ్యక్తిత్వాన్ని స్థిరపర్చుకోవటం ముఖ్యం. ఇప్పుడేం మించిపోయింది? నీ చెల్లెలి జీవితంలో ఇబ్బందులన్నీ పోయి ఆమె సుఖపడాలి. అంతేకదా?"

"అంతే, అంతే ప్రకాశం! దాని మొహం చూస్తోంటే నా మనసంతా పిండినట్టు అవుతుంది, అది సుఖపడాలంటే ఏం చెయ్యాలో తోచదు నాకు. ఎప్పుడే అఘాయిత్యం చేస్తుందోనని భయం."

"రాధ సుఖం కోసం ఏమైనా చేస్తావా?"

"ఏమైనా చేస్తాను. నా ప్రాణాలన్నా ఇస్తాను."

"చెల్లెలి కోసం ప్రాణాలిచ్చి నీ భార్యా బిడ్డల్ని ఏం చేస్తావు? ఓహ్! ఆమె అన్నదగ్గిరికి పంపుతావు కాబోలు, నువ్వు రెండో రామా రావువి."

"అబ్బ! ఏదో అన్నాలే. రాధ సంగ తేం చెయ్యమంటావు?"

"డైవోర్స్‌కి ప్రయత్నాలు చెయ్యటం ఆమెకి మంచిది."

"డైవోర్సా?"

"ఎందుకలా అదిరి పడ్డావు?"

"డైవోర్స్ చేసి....తర్వాత....?"

"ఆమె కిష్టమైతే మళ్ళీ పెళ్ళి...."

"ఛీ! ఏంమాటలోయ్? ఇదేనా నువ్వు చెప్పేది?"

"మరి ఆమె సుఖపడాలన్నావుగా?"

"అంతే మాత్రం ఇలాంటి పనా? ఆమొగుడేకాస్త బుద్ధి తెచ్చు కోవాలి గానీ...."

"నాన్సెన్స్ మాట్లాడకోయ్! ఆ మొగుడికి చాలా బుద్ధివుంది. తెచ్చు కోవాల్సింది నువ్వే. కొన్ని అనుభవాలన్నా నిన్ను మార్చాయేమో అను కొన్నాను. ఇప్పటికీ నీ చెల్లెలు నీ లాగే వుందా? చిలకలాగ నీ మాటలే వల్లిస్తోందా? ఆమెని కలిసి మాట్లాడనా? ఇప్పటికైనా ఆమె నీ ప్రభావం నించి బయటపడితే ఆమెతో సహజీవనం ఎంత ఉన్నతంగా వుంటుందో నే నూహించ గలను....నువ్విలా కోపంతో బుసలు కొట్టడం రామారావు లక్షణం."

"నువ్వేమిటో అనుకుంటున్నావు. అలాంటిపని మాఇంటా వంటా లేదు. మా మేనత్త ఏడోఏట వితంతువైంది. అసలు మొగాడి మొహం ఎరగదు."

"పాపిష్టిజన్మ."

"పాపిష్టిజన్మా? ఆమె ఎంత కీర్తిమంతురాలైందో నీకేం తెలుసు? మానాయనమ్మ పదిహేనో ఏట...."

"సరే! సరే; మీ చరిత్రపుటలు మూసెయ్యి. మీ వంశం గొప్పది. మీ నాయనమ్మా .... మీమేనత్తా పతివ్రతలు. కానీ .... ఆ ఘనతర శక్తులన్నీ....ఇవాళ మీ రాధ జీవితాని కేమన్నా వుపకరిస్తాయో లేదో ఆలోచించు వొక్కసారి."

"ఏమైనాసరే! భరించాల్సిందే, మా ఇంటి ఆడపిల్ల వొక భర్తకి విడాకులిచ్చి ...ఇంకో....ఛీ!...."

"ఒకవేళ రాధఅతని దగ్గర్నుంచి వొచ్చేసి నాతో వుండిపోతే ఏం చేస్తావ్?"

"దాన్ని నరికి నేను నరుక్కుంటాను."

"సరే! వొదిలెయ్యి."

* * *

ప్రకాశం రాధతో మాట్లాడినప్పుడు ఆమె పుట్టింటికే కాదు-మెట్టినింటికికూడా కీర్తితెచ్చే పతివ్రతేననితేలింది. శేషగిరి గర్వపడ్డాడు.

ప్రకాశం చాలాతొందరగా రాధని మర్చిపోగలిగాడు.

* * *

ప్రకాశానికి సుశీలతో పరిచయం స్నేహంగా మారిన తర్వాత ఇలా అడిగాడు- "మీకు అన్నలున్నారా?"

"ఒక అన్న వున్నాడు."

"ఆయన ఎలాంటివారు?—అంటే... మీ విషయాల్లో ఆయన ఎలా ప్రవర్తిస్తారు?"

"సరిగ్గా మాఅన్నయ్య కూడా నిన్న ఇలాగే అడిగాడు మీగురించి. మా అన్నగురించి వివరాలు మీ కెందుకు?"

"మీకు తెలీదనుకుంటాను. స్త్రీల జీవితాలమీద భర్త ఎంత పెత్తనం చేస్తాడో అన్నకూడాఅంత పెత్తనం చేస్తాడు. అంచేతనేను ఆయన్ని గురించి తెలుసుకోవాలి."

"అసలుఇవ్వాళ మాఅన్నయ్యని రమ్మన్నాను మిమ్మల్ని చూస్తాడని."

"నేను చూడ్డం ఏమిటి? అదంతా నువ్వాలోచించుకో—" అన్నాడు అని నవ్వింది సుశీల. ఆమె అందమైన కళ్లు....ఆ ఆరోగ్య వంతమైన మనసు-ఏ నీడలూ ఏ ఛాయలూ లేకుండా స్వచ్ఛంగా, స్పష్టంగా కన బడింది ప్రకాశానికి.

(1971 అక్టోబర్ "వసుధ" మాసపత్రిక నుంచి)